ఫోన్ మోగుతూ ఉంది.

నాకు విసుగ్గా అనిపించింది. ఉదయం నుంచి బిజినెస్ ఫైల్స్ చూసి అప్పటికే తల భారంగా ఉంది. వచ్చే ఫోన్‌కాల్స్ రిసీవ్ చేసుకోవడంలో చిరాకుగా ఉంది. అందుకే విసురుగా రిసీవర్ తీసుకొని "హలో!" అన్నాను.

"హలో....28519?" స్త్రీ కంఠం.

కొందరి గొంతు ఫోన్‌లో చాలా తియ్యగా ఉంటుంది. ఆమె కంఠం న న్నెంతో ఆకర్షించింది. నా చిరాకు క్షణంలో మాయమయింది.


"సారీ.... రాంగ్ నంబర్." చెప్పాను.

అవతలివైపు లైన్ కట్ అయింది.

నేనూ రిసీవర్ పెట్టేసి ఛెయిర్‌లో వెనెక్కు వాలాను. అరనిముషం పాటు రిలాక్స్ అయ్యాక తిరిగి మరో ఫైల్‌లో తల దూరుస్తుండగా, మళ్ళీ ఫోన్ మ్రోగింది. యధాలాపంగా అందుకుని "హలో!" అన్నాను.

మళ్ళీ ఆ తియ్యని స్వరమే నన్ను

కథ



ప్రశ్నించింది- "28519 అండీ?."

"సారీ! ఇది 28510". చెప్పాను.

"సారీ, సర్! నేను 28519 కోసం ట్రై చేస్తుంటే మీ నంబర్ వస్తోంది.....మిమ్మల్ని ఇబ్బంది పెడుతునన్నానుకుంటాను!" తియ్యగా చెప్పిం దామె.

"నోనో, ఇట్స్ ప్లజర్" అని ఆగి తర్వాత అన్నాను. "డయలింగ్ మిస్టేక్ కాదు. బహుశా వైర్స్ - టచ్ అయి ఉంటాయి.....పోనీ ఒక పని చేస్తాను. నేను నా ఫోన్ రిసీవర్ తీసి పక్కన పెట్టేస్తాను.. నా ఫోన్ ఎంగేజ్ అవుతుంది కాబట్టి, ఈ సారి మీరు కోరిన నంబర్ మీకు దొరకొచ్చు."

"మీకు ఇబ్బందేమో!" బాధగా అందామె.

"నోనో! మీకు సహాయం చేయడం నాకెంతో ఆనందంగా ఉంది..... మీ రిక కావలసిన నంబర్ ప్రయత్నించుకొండి." నా ఫోన్ రిసీవర్ తీసి పక్కన పడేశాను.

రెండు నిముషాల తర్వాత రిసీవర్ తీసుకుని "హలో" అంటే ఆమే పలికింది. "హలో సర్! నేను మాట్లాడటం అయిపోయింది. మీరక మీ రిసీవర్ హుక్ మీద ఉంచుకోవచ్చు... అది చెప్పేందుకు ఇంతసేపూ ఉన్నాను."

"అలాగే" అన్నాను రిసీవర్ హుక్ మీద పెట్టేందుకు ప్రయత్నించకనే.

"థాంక్యూ" చెప్పిందామె.

"పర్వాలేదు లేండి."

ఇద్దరి మధ్యా కొద్ది క్షణాల నిశ్శబ్దం.

"వాట్ సర్!....మీరింకా లైన్ కట్ చేయలేదేం?" అడిగిం దామె.

"ఏమీ లేదు." తడబడ్డాను నేను. క్షణం ఆగాక మెల్లగా అడిగాను. "మీ అందమైన పేరు తెలుసుకోవచ్చా?"

# నీ మనసు తెలిసింది!

జంధ్యాల వెంకటేశ్ బాబు

అవతలివైపు కొద్దిక్షణాల మౌనం. తర్వాత చెప్పిం దామె. "నా పేరు లత...."

"స్వీట్ నేమ్! ఏమీ అనుకోకపోతే ఇంకొక్క మాట...."

"చెప్పండి."

"మీ పేరులాగే మీ కంఠం కూడా చాలా తియ్యగా ఉంది."

సన్నగా నవ్విన నవ్వడి వినిపించింది -"బైది బై."

"మళ్ళీ ఎప్పుడు ఫోన్ చేస్తారు?" ప్రశ్నించాను.

"ఇలాగే ఎప్పుడో...."నవ్వి ఫోన్ పెట్టేసిం దామె.

కొన్ని పరిచయాలు మనిషిని విపరీతంగా ప్రభావితం చేస్తాయి. లత పరిచయం నన్ను చాలా ఉత్సాహంగా ఉండేలా చేసింది.

పక్కరోజు నుంచి లత ఫోన్ కోసం ఎదురు చూడడం మొదలయింది. ఆమె తియ్యని కంఠం మరోసారి వినాలనీ, ఆమెతో కాసేపు మాట్లాడాలనీ నా మనసు ఆరాటపడసాగింది. కాని ఆమెకు ఫోన్ చేయాలన్నా తన ఫోన్ నంబర్ నాకు తెలియదు. అందుకే ఆమె నుంచి ఫోన్ కోసం ఆత్రుతతో ఎదురు చూడసాగాను.

రెండు రోజుల తర్వాత లత నుంచి నాకు ఫోన్ వచ్చింది. "హలో సర్! ఎలా ఉన్నారు?"

"మీ గొంతు వినాలని తహతహలాడిపోతున్నాను." టక్కున అనేశాను. అన్న తర్వాత నాకే ఆశ్చర్యం వేసింది - అలా ఎలా అనగలిగానా అని.

ఆమె ఏమీ మాట్లాడలేదు. క్షణంలో నేనే తేరుకున్నాను. నా మాటకు నాకే సిగ్గేసింది నాం చెప్పాను.

"ఇట్సాల్ రైట్" అందామె.

"మీ మనను బాధపెట్టినట్లున్నాను." అపాలజిటిక్‌గా అన్నాను.

"నోనో! అలాంటిదేమీ లేదు లేండి.......కాక పోతే, ఎంతయినా మీ మగవారంత ఇంతేనేమో ననిపిస్తుంది. కొద్దిగా దగ్గరగా వస్తే అతి చనువు తీసుకుంటారు."

ఆ మాటకు నాకు చాలా బాధ కలిగింది. "నే నలాంటి వాడిని కాను..... వాస్తవంగానే మీ ఫోన్ కోసం అలా ఆత్రతతో ఎదురు చూస్తుండడంతో, అప్రయత్నంగానే అలా అనేశాను".

ఈ సారి ఆమె గొంతులో కొద్దిగ ఉత్సాహం తొంగి చూసింది. "నా ఫోన్ కోసం ఎందుకు ఎదురు చూడడం?" ప్రశ్నించిం దామె.

**కొన్ని పరిచయాలు మనస్సును స్పందింపజేసి, ఆనందింపజేస్తాయి. 'ముఖ' పరిచయం లేకుండా నిర్ణయాలు తీసుకునేంత వరకు నడిపించిన ఆ పరిచయం... పరిణామం... ఈ కథ.**

"ఎందుకంటే...ఎందుకంటే...." ఏం చెప్పాలో నాకు తోచలేదు.

ఆమెకు ఏం అర్థమయిందో నాకు తెలియదు. సన్నగా నవ్వింది.

కొద్దిసేపు ఇద్దరం మాట్లాడుకోలేదు.

చివరికి నేనే ఆ నిశ్శబ్దాన్ని ఛేదించాను. "మీరేం చేస్తుంటారు?."

'ఎమ్మెస్సీ చదువు తున్నాను.... అన్నట్టు మీరు?".

"మీరు వినే ఉంటారు. హెవెన్ స్పాట్ అని - దాని మేనేజింగ్ డైరక్టర్‌ని నేను. నా పేరు విశ్వనాథ్."

"అయ్యబాబోయ్! అంత పెద్ద సంస్థకు అధిపతితోనా నే నిప్పుడు మాట్లాడేది?." ఆమె గొంతులో విస్మయం.

నాకు కొద్దిపాటి గర్వం, ఆనందం రెండూ కలిగాయి. నవ్వి ఊరుకున్నాను.

"ఆల్‌రైట్! ఫోన్ పెట్టేస్తున్నాను."

"మరి కాసేపు మాట్లాడకూడదూ?" అర్థించాను.

"ఈ రోజుకు ఇంతే." చెప్పి నవ్వింది.

"పోనీ మళ్ళీ ఎప్పుడు ఫోన్ చేస్తారో చెప్పండి."

"చెప్పాగా! ఎప్పుడో.....ఇలాగే...."

"మీ ఫోన్ కోసం ఆత్రతతో ఎదురు చూస్తుంటాను."

లైన్ కట్ అయింది. ఎదురు చూపు అన్నది అంతకుమునుపు నే నెరుగను. తొలిసారిగా నా జీవితంలో ఎదురు చూపులోని ఆనందాన్ని అనుభవించసాగాను. ఫోన్ రింగయితే - అది లత నుంచే అని ఆత్రతగా అందుకునే వాడిని. ఆమె కాకపోతే నిరాశపడే వాడిని.

లత అప్పుడప్పుడూ నాకు ఫోన్ చేసేది. ఆమె గొంతు వినగానే నాకు ఆకాశాన్ని అందుకున్నంత ఆనందం కలిగేది. ఆమె నాకు ఎన్నో కబుర్లు చెప్పేది. మే మిద్దరం ఎంతో చనువుగా మాట్లాడుకునే వాళ్లం. ఒకరి ఇష్టాలు మరొకరం తెలుసుకునే వాళ్లం, ఏవేవో చర్చించుకునే వాళ్లం. ఒక్కొక్కసారి తమాషాగా రకరకాలుగా క్విజ్‌లు పెట్టుకుని తెలివిని పరీక్షించుకునే వాళ్లం. పబ్లిక్ గార్డెన్‌లో ప్రేమికులు గంటల తరబడి ఎలా 'స్వీట్ నథింగ్స్' చెప్పుకుంటారో, అలా మే మిద్దరం కాలం మరిచిపోయి ఫోన్‌లో మాట్లాడుకునే వాళ్లం.'

అయితే ఏనాడూ మే మిద్దరం హద్దులు దాటేందుకు ప్రయత్నించలేదు. మా మనసులలో ఉండే కోరిక ఏమయినా, మంచి స్నేహితుల్లా మసలు కునే వాళ్లం.

అప్పటికీ నేనే ఒకసారి "లతగారూ! నాకు......నాకు మిమ్మల్ని చూడాలని ఉంది."

"అంటే-" అందమైన స్నేహానికి రూపంతో పని లేదు. మనం దగ్గరగా నిలబడి మాట్లాడుకోవడం కన్నా ఇలా దూరంగా ఉండి మాట్లాడు కోవడం వలననే మరింత స్వేచ్ఛంగా, నిర్మొహమాటంగా ఉండగలుగుతున్నాం.....ఏమంటారు, విశ్వనాథ్ గారూ!" అన్నది లత.

నేనేం బదులు పలకగలను?.

మరోసారి - ఆమె నుంచి వారం రోజులు ఫోన్ రాకపోయే సరికి నాకు విపరీతమైన ఆందోళన కలిగింది. ఆమెకు ఏం జరిగిందోనని నా మనసు ఆత్రపడిపోయింది. ఆ తర్వాత ఆమె నుంచి ఫోన్ రాగానే ఆత్రతగా "ఇన్నిరోజులూ ఏమయిపోయారు?" అంటూ ప్రశ్నించాను.

"అనుకోని ప్రయాణం పడింది. ఫోన్ చేసి వెళ్లాలనుకున్నా వీలు కాలేదు." చెప్పిం దామె.

"పోనీ వెళ్లాకయినా, అక్కడినుంచి ఫోన్ చేయొచ్చుకదా!" కోపంగా అన్నాను.

"నేను వెళ్లింది మారుమూల పల్లెకు, విశ్వనాథ్‌గారు! ట్రంకాల్ చేసేందుకు కూడా అ ఊళ్లో ఫోన్ లేదు. నే నక్కడ ఉన్నానేగాని, నా మనసంతా మీ గురించే ఆలోచిస్తూంది. మీరెంత కంగారు పడుతున్నారోన్న భావంతోనే ఊరి నుంచి రాగానే మీకు ఫోన్ చేస్తున్నాను....."

నా కోపం చప్పున తగ్గిపోయింది."

అలా మే మిద్దరం ఒకరి నొకరు చూసుకోకుండా, ఒకరి వివరాలు ఒకరు పూర్తిగా తెలుసుకోకుండానే చాలా కాలం ఉండిపోయాం. ఈ మధ్య కాలంలో నేను తెలుసుకున్న దేమిటంటే 'లతను నేను ప్రేమిస్తున్నా'నని.

అయితే ఈలోపు మరోవైపు నుంచి ప్రమాదం వచ్చిపడింది నాకు. మా నాన్నగారు నా కో సంబంధం తీసుకు వచ్చారు. భాస్కరరావు మన నగరంలోకెల్లా పెద్ద ఇండస్ట్రియలిస్ట్. ఆయన గారి కూతురు హేమ ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకుని ఈ మధ్యే ఇండియా వచ్చింది. భాస్కరరావు నాకు మంచి స్నేహితుడు. మే మిద్దరం వియ్యంకులం కావాలనుకుంటున్నాము.

నేను నాన్నగారితో నిర్మొహమాటంగా చెప్పాను. "క్షమించాలి! నేను మరొక అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయినే పెళ్లి చేసుకోవా లనుకుంటున్నాను."

నా మాటకు నాన్న సీరియస్ అయ్యారు. "నేను చెపుతున్న గొప్ప సంబంధాన్ని కాదని ఎవరో అనామకురాలిని చేసుకుంటావా?" అన్నాడు.

"లత మరీ అంత అనామకురాలేం కాదు. కాసింత స్టేటస్ ఉన్నట్టుగానే ఉంది. చాలా తెలివైన ,అమ్మాయని మాత్రం చెప్పగలను".

"ఎవ రా అమ్మాయి?" అడిగా రాయన.

"పూర్తి వివరాలు తెలియదు..." అంటూ లతతో నాకున్న పరిచయం గురించి ఆయనకు పూర్తిగా వివరించాను.

అంతా విన్నాక ఆయన నన్నో అమాయకుడిలా చుశాడు. "అంటే ముక్కు ముఖం తెలియకుండా ఫోన్‌లో పరిచయం అయిన అమ్మాయినే పెళ్లి చేసుకుంటా నన్న మాట!."

"ముక్కూ మొహం కన్నా మనసులోని భావాలు ముఖ్యం. ఆమె భావాలు, తెలివి - నాకు నచ్చాయి. కాబట్టి ఆమెనే పెళ్లాడా లను కుంటున్నాను."

నాన్న కోపంగా నా ఎదుటి నుంచి వెళ్లిపోయాడు. నేను ఆఫీసుకు వెళ్లిపోయాను.

కుర్చీలో కూర్చున్న అయిదు నిముషాల తర్వాత ఫోన్ మ్రోగింది. రిసీవర్ అందుకుంటే - అవతలివైపు లత!

"హలో, విశ్వనాథ్‌గారూ! కంగ్రాచ్యులేషన్స్."

"ఎందుకు?"

"అది చెప్పబోయే ముందు ఒక్క విషయం చెప్పండి - ఈ రోజు మీ డాడీ పేరున్న ఇండస్ట్రియలిస్ట్ కూతుర్ని పెళ్లాడమని అడిగితే మీ రెందుకు కాదన్నారు?"

అదిరిపడ్డాను. ఉదయం నాన్నగారితో నేను మాట్లాడిన మాటలు ఇంతలోనే లత కెలా తెలిశాయి? అదే అడిగాను అమితాశ్చర్యంగా!

లత కిలకిలా నవ్వింది. నాకు లీలగా ఏదో తోచింది.

"అది చెప్పబోయే ముందు నేను అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పమని అన్నాను కదా!"

నేను చెప్పాను - "నేనొక అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి భావాలు, ఆలోచనలు నాకు నచ్చాయి. ధనవంతురా లయింత మాత్రననే మనకు తెలియని అమ్మాయిని పెళ్లాడి ఆ భావాలతో కలవలేక, ఆమె ఆలోచనలకు రాజీ పడలేక బ్రతుకు భారంగా గడిపే కన్నా - దగ్గరగా వచ్చిన ఆడపిల్ల ఆలోచనలు అర్థం చేసుకొని, నచ్చిన భావాలను మెచ్చుకుంటూ జీవితాన్ని సాఫీగా గడపడమే నా కిష్టం. నాకు మీ భావాలు - ఆలోచనలూ నచ్చాయి. మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలన్న కోరికతోనే నాన్నగారి అభిప్రాయాన్ని

కాదన్నాను......చెప్పండి!......నేను......నేనంటే మీ కిష్టమేనా?."

"కొద్ది కాలం క్రితం వరకూ మీరంటే నా కెలాంటి అభిప్రాయం ,లేదు. ఇదిగో ఇప్పుడే మీరంటే......" సిగ్గుపడింది లత.

"అది సరే! ఉదయం నాన్నగారితో నేను మాట్లాడిన మాటలు ఇంతలో నీకెలా తెలిశాయి?" ఆఖరి అనుమానం అడిగాను.

లత చెప్పింది. "మా డాడీ పేరు భాస్కర్‌రావు. అన్నట్టు నాపేరు హేమలత."

నా కళ్ల ముందున్న మబ్బుతెర విడిపోయింది. ఇంతకాలం హేమలత ఆడిన నాటకం నాకు అర్థమయిపోయింది.

నేను నవ్వాను. తెరలు తెరలుగా నవ్వాను. నా నవ్వు విని లత కూడా నవ్వసాగింది.

నవ్వాపాక చెప్పింది - ".....ప్రేమించి పెళ్లాడాలన్న కోరికతోనే ఇలా......"